జాతీయ రహదారిపై డివైడర్‌ను దాటుతున్న వాహనదారుడు

దారి మూయాల్సిందే..!

వాంకిడి, జనవరి 17: జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా వాహనదారులు అప్రమత్తంగా ఉండడం లేదు. మండల కేంద్రంలోని ఇంద్రానగర్ సమీపంలోని జాతీయ రహదారిపై డివైడర్‌ను తవ్వి అడ్డుగా షార్ట్‌కట్ దారిని ఏర్పాటు చేశారు. డివైడర్‌ను దాటి నార్లపూర్, సరాండి గ్రామాలకు వెళ్తుంటారు. రహదారిపై హైదరాబాద్ నుంచి నాగపూర్ వైపు అతి వేగంగా వచ్చే వాహనాలు డివైడర్‌ను దాటి వచ్చే వారిని ఢీకొంటే ప్రాణాలు పోయే ప్రమాదముంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి డివైడర్ వద్ద దారిని మూసివేసి ప్రమాదాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బ్యాగులను పరిశీలిస్తున్న ఎంపీడీవో శివకుమార్

బ్యాగ్ ఫిల్లింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

వాంకిడి, జనవరి 17: బ్యాగ్ ఫిల్లింగ్ పనులు వారం రోజుల్లో పూర్తి చేయాలని ఎంపీడీవో శివకుమార్ అన్నారు. బుధవారం ఖమాన గ్రామంలో నర్సరీని పరిశీలించారు. బ్యాగుల్లో నాణ్యమైన మట్టిని పోయాలని, మట్టి నింపాక నీళ్లు పట్టాలని నిర్వాహకులకు సూచించారు. ఫిబ్రవరి 15 వరకు బ్యాగుల్లో విత్తనాలు వేస్తామని పేర్కొన్నారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో 3.50 లక్షల మొక్కలు టార్గెట్ ఉందన్నారు. ఆయన వెంట ఏపీవో శ్రావణ్, పంచాయతీ కార్యదర్శి పోశం తదితరులు ఉన్నారు.



కొండపల్లిలో మందుల కిట్ పంపిణీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్

సద్వినియోగం చేసుకోవాలి

రెబ్బెన, జనవరి 17: ఫైలేరియా, లెప్రసీ వ్యాధిగ్రస్తులు ఎంఎండీపీ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధాకర్‌నాయక్ సూచించారు. రెబ్బెన మండలం కొండపల్లి గ్రామ పంచాయతీలో బుధవారం రెబ్బెన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆధ్వర్యంలో క్యాంప్ నిర్వహించి 50 మంది కిట్లు అందించిన అనంతరం మాట్లాడారు. 6 నెలలకోసారి ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసి రక్త నమూనాలు సేకరించి మందులు కూడా అందిస్తున్నట్లు తెలిపారు. కొండపల్లి గ్రామ సర్పంచ్ వడ్డె శాంత, డాక్టర్ సౌమ్య, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ , తదితరులున్నారు.



వాంకిడిలో కోత కోసిన కంది కొడుతున్న కూలీలు

కొనుగోలు కేంద్రాల జాడేది..

వాంకిడి, జనవరి 17 : ఈ ఏడాది కొనుగోలు కేంద్రాలు కనిపించడం లేదు. గతంతో మార్క్‌ఫెడ్ సంస్థ ఆయా మండలాల్లోని సహకార సొసైటీల ద్వారా కొనుగోలు చేసేది. ప్రధానంగా కంది, మొక్కజొన్న, పప్పు శనగ వంటి పంటలను రైతులకు మద్దతు ధర కల్పించి కొనుగోలు చేసింది. కానీ, ఈ ఏడాది అలాంటి కొనుగోలు కేంద్రాలు ఎక్కడా ఏర్పాటు చేయలేదు. ఇప్పటికే మక్క పంట చేతికంది దాదాపు పదిహేను రోజులు కావస్తోంది. కానీ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో బహిరంగ మార్కెట్‌లో ప్రైవేటు వ్యక్తులకు మండల రైతులు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం కంది పంట కోత కోస్తున్నారు. మరో పది రోజుల్లో కంది కూడా పూర్తిస్థాయిలో చేతికందుతుంది. వేరుశనగ పంట కూడా మరో 20 రోజుల్లో కోతకు వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. దీంతో కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి వస్తే రైతులకు ఊరట లభిస్తుంది.

యువత క్రీడల్లో రాణించాలి

కౌటాల : విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న సీఐ సాదిక్ పాషా

కౌటాల, జనవరి 17: యువత క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కౌటాల సీఐ సాదిక్ పాషా అన్నారు. బుధవారం మండలంలోని మొగడ్ధగడ్‌లో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఆయన బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువకులు తమ విలువైన సమయాన్ని వృథా చేయకుండా, క్రీడలు, ఉన్నత చదువులు, ఉద్యోగ సాధనలపై దృష్టి సారించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువ క్రీడాకారుల్లో ఎంతో ప్రతిభ దాగి ఉందని, ఇలాంటి క్రీడల్లో పాల్గొన్నప్పుడే వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. యువతకు పోలీసులు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు, క్రీడల్లో రాణించిన వారికి ఉన్నత స్థానాలకు చేరేందుకు, అలాగే ఉద్యోగ సాధనలో ఉన్న అభ్యర్థులకు అవసరమగు సౌకర్యాలు కల్పించేందుకు పోలీసులు ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నట్లు సీఐ తెలిపారు. ఈ కబడ్డీ పోటీల్లో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడు ఎంతో క్రీడా స్ఫూర్తితో ఆడారన్నారు. ప్రతి క్రీడాకారుడు గెలుపే లక్ష్యంగా ఆడారని, ఓడిన క్రీడాకారులు నిరుత్సాహపడకూడదన్నారు. నేటి ఓటమి రేపటి గెలుపుకు పునాది కావాలన్నారు. ఓడిన క్రీడాకారుల్లోనూ ఎంతో ప్రతిభ ఉందని ఆయన తెలిపారు. 60 కిలోల బరువు గల పోటీల్లో మొదటి స్థానం మొగడ్ధగడ్, రెండో స్థానం ఈస్‌గాం, మూడో స్థానం విర్దండి, అదేవిధంగా 54 కిలోల బరువు పోటీల్లో మొదటి స్థానం మహారాష్ట్ర చంద్రపూర్ జిల్లా వేడ్‌గావ్, రెండో స్థానం టోంకిని, మూడోస్థానం తాటిపల్లి గ్రామాల టీంలు గెలుపొందాయి. ఈ పోటీల్లో మొదటి బహుమతి 21,111, రెండో 11,111, మూడో బహుమతి 5,111ల నగదుతో పాటు షీల్డులను అందజేశారు. బెస్ట్ రైడర్‌గా రోషన్ మడావి, బెస్ట్ డిఫెండర్‌గా మోహిత్ నికాడేకు రూ.2500ల నగదును అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉర్వత్ జీజాబాయి, ఉపసర్పంచ్ బదన్ కల్పన, ఎంపీటీసీ బొమ్మకంటి మనీశ్, కార్యదర్శి శ్రావణీ, మహేశ్, బీజేపీ మండలాధ్యక్షుడు వాను పటేల్, ఏర్మ సుధాకర్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రేపు రాజకీయ నాయకులతో సమావేశం

పెంచికల్ పేట్, జనవరి 17 : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు మధ్యాహ్నం హాజరుకావాలని కోరారు.

అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ రెబ్బెన ఫారెస్ట్ రేంజ్ అధికారి నిజాముద్దీన్

కొత్త భూముల్లో పోడు వ్యవసాయం చేస్తే చర్యలు

- రెబ్బెన అటవీ రేంజ్ అధికారి నిజాముద్దీన్

రెబ్బెన, జనవరి 17: రెబ్బెన రేంజ్ పరిధిలోని అటవీ భూముల్లో పాత ఆర్వోఎఫ్ఆర్ భూములకు అనుకొని ఉన్న కొత్త భూములు చదును చేసి పోడు వ్యవసాయం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రేంజ్ అధికారి నిజాముద్దీన్ హెచ్చరించారు. రెబ్బెన రేంజ్ పరిధిలోని ఖైర్‌గూడ, గొల్లగూడ గ్రామాల్లో బుధవారం అటవీశాఖ ఆధ్వర్యంలో వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్, స్నేర్, కొత్త పోడు వ్యవసాయం జరుగకుండా అవగాహన సదస్సు నిర్వహించారు. అటవీ అధికారులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కొందరు కొత్త భూముల్లో పోడు వ్యవసాయం చేయడానికి ప్రయత్నించగా, అలాంటి వారిపై కేసు నమోదు చేసి జరిమానా విధించినట్లు చెప్పారు. సెక్షన్ ఆఫీసర్లు సతీశ్, కొమ్మలు, బీట్ ఆఫీసర్లు భూక్యా రవి, స్వర్ణలత, తదితరులున్నారు.

బుగ్గ దేవుడికి ప్రత్యేక పూజలు

పూజలు చేస్తున్న కుమ్రం సోనేరావ్

సిర్పూర్(యు) జనవరి 17 : మండలంలోని మహాగావ్ గ్రామ మంచాయతీలోని అల్లిగూడ గ్రామ శివారులో ఉన్న బుగ్గక్షేత్రంలో బుగ్గ దేవుడికి బుధవారం కుమ్రం భీమ్ మనవడు కుమ్రం సోనేరావ్ ప్రత్యేక పూజలు చేశారు. అయన మాట్లాడుతూ ఈ క్షేత్రంలో పుష్య మాసంలో ఆదివాసులు తమ వంశ పెద్ద దేవులతో పాటు భీమా దేవుడు, జంగుబాయి, జలకర్‌దేవి దేవుళ్లకు పూజలు చేస్తారని తెలిపారు. సర్పంచ్ పెందోర్ నాగోరావ్, సిర్పూర్ గ్రామ పటేల్ ఆత్రం ఆనంద్ రావ్, నాయకులు అర్క నాగోరావ్, ఆత్రం రాజేశ్వర్, గేడం లక్ష్మణ్, ఆత్రం బాపురావ్, మెస్రం సుభాష్, తదితరులున్నారు.

నేడు పోచమ్మ విగ్రహప్రతిష్ఠాపన

ముస్తాబైన కొండపల్లి పోచమ్మ ఆలయం

పెంచికల్ పేట్, జనవరి17 : మండలంలోని కొండపల్లిలో సర్పంచ్ ఉపాసి సంజీవ్ గ్రామస్తుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో గురువారం రెబ్బెన మండలం ఇందిరా నగర్ స్వయంభు మహంకాళి ఆలయ ప్రధాన పూజారి దేవర వినోద్ చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్నట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి బోనంతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు చెప్పారు. గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-319415-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

నిర్మల్: 91827 77671, 91827 77677

గడువులోగా పనులు పూర్తి చేయాలి

రెబ్బెన, జనవరి 17: బెల్లంపల్లి ఏరియాలోని ఖైర్‌గూడ ఓసీపీలో కొత్తగా నిర్మిస్తున్న ఇన్ ఫిట్ క్రషర్, కన్వేయర్స్ పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జీఎం(ఈఅండ్ఎం-సీహెచ్‌పీలు) నవీన్‌కుమార్ సూచించారు. ఏరియా పర్యటనకు వచ్చిన ఆయన గోలేటి సీహెచ్‌పీతో పాటు ఖైర్‌గూడ ఓసీపీలో నూతనంగా నిర్మిస్తున్న పనులను అధికారులతో కలిసి బుధవారం పరిశీలించి పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఏజీఎం తిరుమల్‌రావు, ఎస్ఈ(ఈఅండ్ఎం) కేశవరావు, ఖైర్‌గూడ పీవో సత్యనారాయణ, ఫిట్ ఇంజినీర్ వీరన్న, ఈఈ(సివిల్) రాజేంద్రప్రసాద్ పలువురు ఉన్నారు.

ఖైర్‌గూడ ఓసీపీలో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న జీఎం(ఈఅండ్ఎం-సీహెచ్‌పీలు) నవీన్‌కుమార్

తూకాల్లో వ్యత్యాసాలు

- నష్టపోతున్న అన్నదాతలు

వాంకిడి, జనవరి 17: ఆరుగాలం కష్టపడి పండించిన పత్తిని అమ్ముకునే సమయంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అమాయక రైతులను ఆసరాగా చేసుకుని పత్తి వ్యాపారులు, దళారులు తూకాల్లో మోసం చేస్తున్నారు. పండించిన పంటలో ఎంతో కొంత లాభం వస్తుందనే ఆశతో ఉన్న రైతులకు తీరని అన్యాయం జరుగుతున్నది. రైతులకు ఎక్కువ ధర వెచ్చిస్తామని చెప్పి దళారులు నట్టేట ముంచుతున్నారని మండల రైతులు ఆరోపిస్తున్నారు. తూకం కొలతల శాఖకు సంబంధించిన అధికారులు తూకాల్లో వ్యత్యాసాలు పరిశీలించాలని రైతులు కోరుతున్నారు.

నేడు చెప్రాడకు మహా పాదయాత్ర

బెజ్జూర్, జనవరి 17 : గురువారం మండలంలోని ఎల్కపల్లి శ్రీ అభయాంజనేయ ఆలయం నుంచి మహారాష్ట్రలోని చెప్రాడకు 19వ మహాపాదయాత్రకు బయలు దేరనున్నట్లు పాదయాత్ర కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పాదయాత్ర బెజ్జూర్, కుకుడ, పోతెపల్లి, బారెగూడ, ముంజంపల్లి, రుద్రాపూర్, మానెపల్లి అనుకోడ రవీంద్రనగర్ తదితర గ్రామాల మీదుగా ప్రాణహిత నదిని దాటి చెప్రాడలోని శ్రీ దత్తావతార్ కార్తీక స్వామి ఆలయానికి చేరుకోనున్నట్లు తెలిపారు. పాదయాత్ర భక్తులకు సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఆయా గ్రామాల్లో భోజనం, అల్పాహారం తదితర వసతులు ఏర్పాటు చేయనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని వారు కోరారు.

19 నుంచి రాష్ట్ర స్థాయి క్యారమ్ ఎంపిక పోటీలు

బెల్లంపల్లి, జనవరి 17: తెలంగాణ రాష్ట్ర క్యారమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో రాష్ట్ర స్థాయి క్యారమ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్యారమ్ అసోసియేషన్ కార్యదర్శి రాచకట్ల బాలరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి తనుగుల రాజన్న తెలిపారు. అండర్-12,-14,-18, అండర్-21 విభాగాల్లో బాలబాలికలకు పోటీలుంటాయని పేర్కొన్నారు. తమ ఎంట్రీలను ఈ నెల 18వ తేదీలోగా పంపించాలని తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను ఫిబ్రవరిలో తమిళనాడులోని మధురైలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 9440010404కు సంప్రదించాలని సూచించారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

హాజీపూర్, జనవరి 17 : ఈ నెల 20, 21 తేదీల్లో నిర్వహిస్తున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని అర్హులైన యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని హాజీపూర్ తహసీల్దార్ సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. రెండు రోజుల పాటు పోలింగ్ బూత్‌లలో బీఎల్వోలు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటు నమోదుతో పాటు మార్పులు చేర్పులను చేసుకోవచ్చని వివరించారు.

జాతర వేలం రూ.18,46,000

ఆలయంలో వేలం పాటకు హాజరైన అధికారులు, నాయకులు

రెబ్బెన, జనవరి 17: మండలంలోని గంగాపూర్ గ్రామశివారులో కొలువైన శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి జాతర ఫిబ్రవరి 23, 24, 25 తేదీల్లో పెద్దఎత్తున జరుగనుండడంతో ఆలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన వేలంపాటలో రూ.18,46,000 లక్షల ఆదాయం వచ్చినట్లు వేలం పాట స్పెషల్ ఆఫీసర్, దేవాదాయ ధర్మధాయ శాఖ కార్యనిర్వహణాధికారి గర్రెపల్లి వేణుగోపాల్‌గుప్తా, గంగాపూర్ శ్రీ బాలాజీ ఆలయ ఈవో బాపురెడ్డిలు తెలిపారు. శ్రీ బాలాజీ వేంకటేశ్వస్వామి జాతరకు కొబ్బరికాయలు, పూజాసామగ్రి, ప్రసాదం విక్రయాలు, తైబజార్ నిర్వహణ, వాహనాల పార్కింగ్, కొబ్బరిముక్కలు సేకరణ హక్కుల కోసం రూ.18,46,000 లక్షలు రాగా గత సంవత్సరం రూ.13,40,500 లక్షలు వచ్చినట్లు తెలిపారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం రూ.5,05, 500 లక్షలు అదనంగా వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు వోల్వోజి వెంకటేశంచారి, పందిర్ల మధునయ్య, లెండుగురే ఇస్తారి, ముంజం శ్యాం, గందె సంతోశ్, లావుడ్య రమేశ్, దుర్గం దేవాజీ, మోడెం సుదర్శన్ గౌడ్, అనిశెట్టి వెంకన్న, ఇగురపు సంజీవ్, ముంజం రవీందర్, లెండుగురే గంటుమేర, బొంగు నర్సింగ రావు, గోగర్ల రాజేశ్, అవిడపు గోపి, మిట్ట దేవేందర్, దుర్గం అన్నాజీ, మండల తిరుపతి, పూదరి హరీశ్, దుర్గం మహేశ్, అజ్మీర అశోక్, గుర్లే రాంచందర్, జయరాం, చంద్రయ్య, అరుణ్ పలువురు ఉన్నారు.

గుండి వంతెన పనులు పూర్తి చేయాలి

- ఆసిఫాబాద్ ఎంపీపీ మల్లికార్జున్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 17: మండలంలోని గుండి వంతెన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ అన్నారు. వంతెన నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌తో మాట్లాడుతూ పనుల్లో అలసత్వం వహించవద్దని, నాణ్యతతో వెంటనే నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. ఈ వానకాలంలోగా వంతెన పనులను పూర్తి చేయాలని అన్నారు. గుండి మాజీ సర్పంచ్ షెండే దత్తు, వైస్ ఎంపీపీ సుంకరి మంగ పెంటయ్య, ఈదులవాడ సర్పంచ్ బూసి భీమేశ్, మల్లేశ్, సత్తి, విశ్వనాథ్ తదితరులున్నారు

మాట్లాడుతున్న ఎంపీపీ అరిగెల మల్లికార్జున్

రిటైర్డ్ కార్మికులకు బోనస్, వాటా, ఏరియర్స్

రెబ్బెన, జనవరి 17 : రిటైర్డ్ కార్మికులకు లాభాల బోనస్, లాభాల వాటా, ఏరియర్స్ డబ్బులను యాజమాన్యం చెల్లిస్తుందని, ఈ విషయాన్ని రిటైర్డ్ కార్మికులు గమనించాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 2022-అక్టోబర్ 2023 మధ్య విరమణ పొందిన వారికి దీపావళి బోనస్, ఏప్రిల్ 2022- మార్చి 2023 మధ్య విరమణ పొందిన వారికి లాభాలవాటా, 2021 జూలై తరువాత విరమణ పొందిన వారికి 11వ వేజ్‌బోర్డు ఏరియర్స్ వేతనాలు చెల్లిస్తున్నట్లు వివరించారు. 32 శాతం లాభాలవాటా ఈ నెల 19వ తేదీన, దీపావళి బోనస్ ఈ నెల 21న, ఏరియర్స్ ఫిబ్రవరి 6వ తేదీన చెల్లించనున్నట్లు తెలిపారు.

20న అవిశ్వాస తీర్మానం!

కాగజ్‌నగర్, జనవరి 17: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఏకైక మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు ఈ నెల 20న అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నారు. చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను ఆశిస్తున్న వారు కొంతమంది కౌన్సిలర్లను క్యాంపులకు తరలించినట్లు తెలిసింది. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో 30 వార్డులు ఉండగా అందులో 22 మంది బీఆర్ఎస్ నుంచి, ఆరుగురు కాంగ్రెస్ నుంచి, ఇద్దరు స్వతంత్రులుగా గెలుపొందారు. గత నెల 20న 25 మంది కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టడానికి కలెక్టర్ కార్యాలయంలో నోటీసు అందించారు. ఈ మేరకు 20న అవిశ్వాసం ప్రవేశపెటేటందుకు 30 మంది కౌన్సిలర్లతో పాటు ఎక్స్ ఆఫిషియా సభ్యుడు, ఎమ్మెల్యే హరీశ్ బాబుకు నోటీసులు అందించారు.

కేవీపీఎస్ క్యాలెండర్ విడుదల

క్యాలెండర్ విడుదల చేస్తున్న కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 17 : కేవీపీఎస్ క్యాలెండర్‌ను కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు ఆ సంఘం జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, నాయకులతో కలిసి బుధవారం తన కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా దుర్గం దినకర్ మాట్లాడుతూ మహనీయుల స్ఫూర్తితో కేవీపీఎస్ నిర్వహిస్తున్న సామాజిక ఉద్యమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు డొంగ్రి మహేశ్వర్, నాగేశ్, బాబాజీ తదితరులు ఉన్నారు.

సీఐటీయూ క్యాలెండర్..

కాగజ్‌నగర్, జనవరి 17: కాగజ్‌నగర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సీఐటీయూ క్యాలెండర్‌ను ఆర్డీవో సురేశ్ ఆధ్వర్యంలో సీఐటీయూ నాయకులు బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రమోద్ కుమార్, తహసీల్దార్ కిరణ్‌కుమార్, సీఐటీయూ నాయకులు ముంజం ఆనంద్ కుమార్, సీఐటీయూ నాయకులు, హమాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

నలుగురిపై కేసు

వాంకిడి, జనవరి 17: మండలంలోని కనర్గాం గ్రామ శివారు ప్రాంతంలో పేకాట స్థావరంపై వాంకిడి పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం సాయంత్రం కనార్‌గాం శివారులో కొందరు పేకాడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. నలుగురిని అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి రూ.1300 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వాంకిడి పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో పేకాడినా, దేశీదారు, గుడుంబా విక్రయించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.